



మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

అప్రమత్తంగా ఉండాలి

- వర్షాల నేపథ్యంలో చెరువులు, ప్రాజెక్టుల లీకేజీలను గుర్తించాలి
- అధికారులతో కలెక్టర్ నారాయణరెడ్డి

రంగారెడ్డి అర్బన్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): వచ్చే రెండు రోజులు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున వాతావరణ శాఖ రెడ్ అలెర్ట్ ప్రకటించిందని, అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో భారీ వర్షాల నేపథ్యంలో తీసుకోవాల్సిన ముందస్తు చర్యలు, వన మహోత్సవం, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలపై ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, ఇతర శాఖల అధికారులతో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ 24 గంటలపాటు అందుబాటులో ఉంటుందని తెలిపారు. 15 సెంటీ మీటర్లు వర్షం పడినా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. ప్రమాదకరంగా ఉన్న చెరువులు, ప్రాజెక్టులను పరిశీలించి లీకేజీలు ఉంటే గుర్తించి పరిష్కరించాలన్నారు. షార్ట్ సర్క్యూట్ జరగకుండా విద్యుత్‌శాఖ అధికారులను అప్రమత్తం కావాలన్నారు. యూరియా కొరత లేకుండా చూడాలని జిల్లా వ్యవసాయాధికారికి సూచించారు. రోడ్లపై విరిగిన చెట్లను అప్పటికప్పుడు తొలగించాలని, భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు, సిబ్బంది పూర్తి స్థాయిలో ఫీల్డ్‌లో ఉండాలని ఆదేశించారు.

కంట్రోల్ రూమ్ నంబర్ 79931 03347

వరదలు, ప్రమాదాలు జరిగితే అత్యవసర పరిస్థితుల్లో కలెక్టరేట్‌లోని కంట్రోల్ రూమ్ నంబర్ 79931 03347, 040-23237416కు సమాచారం ఇవ్వాలని తెలిపారు. కాన్ఫరెన్స్‌లో డీఆర్వో సంగీత, డీఆర్‌డీఏ పీడీ శ్రీలత, డీపీవో సురేశ్‌మోహన్, వ్యవసాయాధికారి ఉష, డీఈవో సుశీంద్రరావు, ఎస్సీ సంక్షేమాధికారి రామారావు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యాన్ని అధిగమించాలి

వన మహోత్సవంలో భాగంగా ఆయా శాఖలకు కేటాయించిన లక్ష్యాన్ని వంద శాతం పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. వారంలోగా పూర్తి స్థాయిలో మొక్కలు నాటాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు పూర్తయిన వాటికి బిల్లులు వెంటనే మంజూరు చేయాలని ఆదేశించారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలపై సోలార్ సిస్టమ్ ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనలను ఈనెల 16లోగా సమర్పించాలని ఆదేశించారు.

రేపు జాబ్ మేళా

రంగారెడ్డి అర్బన్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): డిగ్రీ పాసై 20 నుంచి 25 ఏళ్ల మధ్య ఉన్న నిరుద్యోగ యువతకు ఈనెల 14న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి జయశ్రీ తెలిపారు. మేజిక్ బస్సు ఫౌండేషన్ 12 రోజులపాటు బేసిక్ ఏఐ ట్రైనింగ్, సైబర్ సెక్యూరిటీ, ఎంప్లాయబిలిటీ స్కిల్స్ కోర్సులు నేర్పించి ఉద్యోగం కల్పిస్తుందని పేర్కొన్నారు. జిల్లాలో అర్హత కలిగిన నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాల కోసం 89771 75394 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

మేడిగడ్డ తండా కార్యదర్శి వెంకటయ్య సస్పెండ్



ఆమనగల్లు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మేడిగడ్డ తండా పంచాయతీ కార్యదర్శి వెంకటయ్య సస్పెండ్ అయ్యారు. కలెక్టర్ నారాయణరెడ్డి నుంచి ఈ మేరకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. మంగళవారం ఆమనగల్లు మండల పరిషత్ కార్యాలయానికి ఉత్తర్వులు అందినట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో రహెమాన్ తెలిపారు. పంచాయతీ నిధులు దుర్వినియోగం, చట్టబద్ధమైన బాధ్యతలను నిర్వర్తించడంలో నిర్లక్ష్యం వహించడంతో కార్యదర్శి వెంకటయ్యను సస్పెండ్ చేస్తున్నట్లు పేర్కొన్నారు. వెంకటయ్య మండల పరిధిలోని మంగళపల్లి గ్రామ ఇన్‌చార్జి కార్యదర్శిగా పని చేశారు. అక్కడ ఎన్ఆర్ఈజీఎస్ ఖాతా ద్వారా రూ.2.55 లక్షలు అడ్వాన్స్ తీసుకొని వాడుకున్నారు. మేడిగడ్డ తండాలో పన్నుల ద్వారా వచ్చిన నగదు నుంచి రూ.76,875, కోనాపూర్ పంచాయతీగా పని చేసిన సమయంలో రూ.16,342 ట్రెజరీలో జమ చేయకుండా సొంతానికి వాడుకున్నట్లు గుర్తించారు. ఎంపీడీవో ఇచ్చిన నివేదిక మేరకు వెంకటయ్యను సస్పెండ్ చేశారు.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి పెట్టాలి

మొయినాబాద్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంపై రైతులు దృష్టి పెట్టాలని జిల్లా వ్యవసాయ అధికారి ఉషా పేర్కొన్నారు. మంగళవారం మొయినాబాద్ రైతు వేదికలో రైతు నేస్తం కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రైతులు పంటలకు పురుగు మందుల వాడకాన్ని తగ్గించాని, సైంద్రియ ఎరువులు వాడాలని సూచించారు. రైతులు రైతు బీమా పథకానికి 18 నుంచి 59 సంవత్సరాల వయసున్న రైతులు అర్హులని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ సురేష్‌బాబు తదితరులు ఉన్నారు.



జిల్లాలోని ఆమనగల్లు, శంషాబాద్, ఇబ్రహీంపట్నం, యాచారంలోని డైరెక్టర్ ఆఫ్ హెల్త్(డీహెచ్) ఆస్పత్రులను 2023లో అప్పటి బీఆర్ఎస్ సర్కార్ కమ్యూనిటీ ఆస్పత్రులుగా ఉన్నతీకరించింది. కానీ, ఆయా ఆస్పత్రులకు పూర్తి స్థాయిలో వైద్యులను నియమించకుండా ఇతర ఆస్పత్రులకు జనరల్ ఫిజీషియన్లు, గైనకాలజిస్టులను డిప్యూటేషన్‌పై పంపించింది. దీంతో కమ్యూనిటీ ఆస్పత్రుల్లో వైద్యుల కొరత వెంటాడుతోంది. ఒక్క షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రి నుంచే ఎనిమిది మంది వైద్యులు డిప్యూటేషన్లపై వెళ్లడంతో ఇబ్బందులు తప్పడం లేదు.

సిబ్బంది లేక ఇబ్బంది

షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రిలో గైనకాలజిస్టుల కొరత

- ఆరుగురు ఉండాల్సిన చోట ఇద్దరే వైద్యులు
- డిప్యూటేషన్‌పై వైద్యుల తరలింపుతో తిప్పలు
- పరీక్షల కోసం వచ్చే గర్భిణులు 300కు పైనే..
- కాన్పులు మాత్రం 100లోపే..

షాద్‌నగర్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రిలో గైనకాలజిస్టుల కొరత వెంటాడుతోంది. వైద్యులు లేక గర్భిణులు, రోగులు ఇబ్బందులు పడుతుంటే ఉన్న వైద్యులను ప్రభుత్వం ఇతర ప్రాంతాల్లోని ఆస్పత్రులకు డిప్యూటేషన్‌పై తరలించింది. షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రిలో గర్భిణుల సంఖ్య ఎక్కువగా ఉండటంతో ఈ ఆస్పత్రికి రాష్ట్ర ప్రభుత్వం ఆరుగురు గైనకాలజిస్టులను పూర్తి స్థాయిలో నియమించింది. కానీ, ఉన్న ఆరుగురిలో నలుగురు గైనకాలజిస్టులను ఇతర ప్రాంతాల్లో ఉన్న ఆస్పత్రులకు డిప్యూటేషన్‌పై తరలించింది. దీంతో షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రిలో కేవలం ఇద్దరు గైనకాలజిస్టులు మాత్రమే గర్భిణులకు సేవలు అందిస్తున్నారు. వారంలో రెండు రోజులు వైద్య పరీక్షల కోసం ఆస్పత్రికి వచ్చే గర్భిణులు గంటల తరబడి క్యూలైన్‌లో నిల్చోవలసిన పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం ఉన్న ఇద్దరు గైనకాలజిస్టుల్లో ఒక వైద్యురాలు గర్భిణి. డెలివరీ కోసం త్వరలోనే ఆమె కూడా సెలవుపై వెళ్లనున్నట్లు సమాచారం. ఒకవేళ ఆమె సెలవుపై వెళ్తే ఒక గైనకాలజిస్టు మాత్రమే అందుబాటులో ఉండనుంది.

భారీగా తగ్గిన కాన్పులు

కమ్యూనిటీ ఆస్పత్రిలో వైద్యుల కొరతతో కాన్పుల సంఖ్య భారీగా తగ్గింది. ప్రతి నెలా 150 వరకు కాన్పులు

మిగతా 8వ పేజీలో...

ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తా..



షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రిలో పని చేస్తున్న వైద్యుల డిప్యూటేషన్లను రద్దు చేయాలని ఇటీవల వైద్య శాఖ అధికారులను కోరాను. ఈ విషయంపై వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దృష్టికి తీసుకువెళ్తాను. త్వరలోనే డిప్యూటేషన్లు రద్దు చేయిస్తాను.

- వీర్లపల్లి శంకర్, ఎమ్మెల్యే



గైనకాలజిస్ట్ ఓపీ వద్ద బారులు తీరిన గర్భిణులు

పర్యవేక్షణ లేక పరేషాన్

ప్రైవేటు హాస్టళ్లపై నిఘా కరువు

- అధికారిక అనుమతి లేకుండా నిర్వహణ
- ఆదాయంపైనే నిర్వాహకుల దృష్టి
- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డగా హాస్టళ్లు
- పట్టించుకోని అధికారులు, నాయకులు

మొయినాబాద్ రూరల్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): నగర శివారు మొయినాబాద్ మండలంలో అనేక ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలలు ఉన్నాయి. దీంతో చుట్టుపక్కల వందల సంఖ్యలో ప్రైవేటు హాస్టళ్లు వెలిశాయి. ఇక్కడ చదువుతున్న విద్యార్థులతో పాటు ఉపాధి కోసం, ఉద్యోగాల కోసం వచ్చిన ఎందరో యువతీ, యువకులు ప్రైవేటు హాస్టళ్లలో ఆశ్రయం పొందుతున్నారు. ఎలాంటి రిజిస్ట్రేషన్ లేకుండానే ఎంతోమంది హాస్టళ్లను ఇష్టానుసారంగా నడుపుతున్నారు. హాస్టళ్లపై ఏ ప్రభుత్వ అధికార విభాగం పర్యవేక్షిస్తుందో స్పష్టత లేదు. విద్యార్థుల భద్రత, ఆరోగ్య ప్రమాణాలు పరిరక్షించే అధికారగణం కొరవడింది. హాస్టళ్ల ఏర్పాటుకు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉంటే అనుమతి తీసుకోవాలి. గ్రామపంచాయతీ పరిధిలో ఉంటే గ్రామ పంచాయతీ అనుమతి తప్పనిసరి. కానీ, ఇవేమి పట్టించుకోకుండా ఇష్టానుసారంగా హాస్టళ్ల నిర్వహణ కొనసాగుతుంది. ముఖ్యంగా శాంతి భద్రతల పర్యవేక్షణ, అసాంఘిక కార్యకలాపాల నివారణకు పోలీసు శాఖ, ఫైర్ సేఫ్టీ అనుమతి, ఆహార భద్రత, నాణ్యతపై ఫుడ్ సేఫ్టీ నుంచి లైసెన్స్ పొందాల్సి ఉంటుంది. ఆయా విభాగాల అనుమతులతో హాస్టల్ నిర్వహించాల్సి ఉంటుంది. అయితే ఎలాంటి అనుమతులు

మిగతా 8వ పేజీలో...



ఓ హాస్టల్‌లో కిచెన్ దుస్థితి(ఫైల్)

ప్రైవేటు హాస్టళ్లపై నిఘా పెట్టాలి



ఇంజినీరింగ్ కళాశాలల చుట్టూ నిబంధనలకు విరుద్ధంగా ఇష్టానుసారంగా ప్రైవేటు హాస్టళ్లు వెలిశాయి. దీంతో పరిసరాలు అసాంఘిక కార్యకలపాలకు అడ్డాగా మారాయి. హాస్టళ్లపై పోలీసుల నిఘా కరువైంది. హాస్టల్ పరిసరాలు శుభ్రంగా ఉండడం లేదు. దీంతో విద్యార్థులు రోగాల బారిన పడుతున్నారు. ఉన్నతాధికారులు గుర్తించి ప్రైవేటు హాస్టళ్లపై నిఘా పెట్టాలి.

- షాబాద్ కిషన్, హిమాయత్ నగర్, మొయినాబాద్ మండలం

మోదీ గుప్పిట్లో ఎన్నికల కమిషన్

షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ ఎన్నికల కమిషన్‌ను గుప్పిట్లో పెట్టుకుని రాజ్యాంగాన్ని భ్రష్టు పట్టిస్తున్నారని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆరోపించారు. పార్లమెంట్ సాక్షిగా దొంగ ఓట్లను రాహుల్ గాంధీ నిరూపిస్తే వాటిని సవరించేందుకు చర్యలు తీసుకోకుండా కాంగ్రెస్ అగ్ర నేతలను అరెస్టు చేయడం సమంజసం కాదన్నారు. మంగళవారం క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం స్వయం ప్రతిపత్తి గల సంస్థలను తమ గుప్పిట్లో పెట్టుకొని ఆడిందే ఆట.. పాడిందే పాటలా వ్యవహరిస్తోందన్నారు. ఆయా రాష్ట్రాల్లో దొంగ ఓటర్ల గురించి రాహుల్ గాంధీ సాక్షాధారాలతో నిరూపిస్తే బీజేపీ ప్రభుత్వం రాహుల్, ప్రియాంక గాంధీ తోపాటు పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతోపాటు మరో 300మందిని అరెస్టు చేయడం సరికాదన్నారు. రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవడం కోసమే ఉద్యమం చేస్తున్నామన్నారు. కేంద్ర ఎన్నికల కమిషన్ తీరుపై ఇంకా పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామన్నారు. నందిగామ మండలం మొదళ్లగూడ గ్రామంలో ఉన్న దొంగ ఓట్ల భండారాన్ని బయట పెట్టేందుకు త్వరలోనే చలో మొదళ్లగూడ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. గ్రామంలో 250 దొంగ ఓట్లు ఉన్నాయని రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా స్పదించడం లేదన్నారు. గ్రామంలో దొంగ ఓటర్ల జాబితాను బహిర్గతం చేస్తామన్నారు. సమావేశంలో నాయకులు చెంది తిరుపతిరెడ్డి, రఘునాయక్, బాలరాజుగౌడ్, అగ్గనూరు బస్వం, ఇబ్రహీం పాల్గొన్నారు.



ఈవీఎం గోడౌన్‌ను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి

ఈవీఎం గోడౌన్ పరిశీలన

రంగారెడ్డి అర్బన్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): రాజేంద్రనగర్‌లోని ఈవీఎం గోడౌన్‌ను అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి మంగళవారం పరిశీలించారు. సాధారణ పరిశీలనలో భాగంగా క్షేత్ర స్థాయి సందర్శన చేశారు. ఈవీఎం గోడౌన్‌కు వేసిన సీళ్లను పరిశీలించి, బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్లు ఇతర సామగ్రిని, ఈవీఎం గోడౌన్ వద్ద పోలీసు బందోబస్తు తీరును పరిశీలించారు. రాజేంద్రనగర్ ఆర్డీవో వెంకట్‌రెడ్డి, తదితరున్నారు.

రూ.25 కోట్లతో మున్సిపాలిటీ
సమగ్రాభివృద్ధి 8
ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

రూ.కోటి డ్వాక్రా నిధులు స్వాహా

- బ్యాంక్‌లో చౌదర్‌పల్లి మహిళల ఆందోళన
- ఎమ్మెల్యే కారు అడ్డగింత.. బ్యాంక్ ఎదుట ధర్నా



ఆందోళన చేస్తున్న డ్వాక్రా సంఘాల మహిళలు

యాచారం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): యాచారం ఎస్‌బీఐలో బుక్ కీపర్లు డ్వాక్రా పొదుపు సంఘాల మహిళల సంతకాలను ఫోర్జరీ చేసి రూ.కోటి కాజేశారని, తమకు న్యాయం చేయాలని మండలంలోని చౌదర్‌పల్లి గ్రామానికి చెందిన డ్వాక్రా పొదుపు సంఘాల మహిళలు మంగళవారం బ్యాంక్‌లోనే ఆందోళన చేశారు. గ్రామానికి చెందిన పలువురు డ్వాక్రా సంఘాల మహిళలు గతంలో రుణం తీసుకొని పూర్తిగా చెల్లించినా ఇంకా బాకీ ఉన్నట్లు బుక్ కీపర్లు తెలిపారు. దీంతో రుణం మొత్తం చెల్లించాం, ఇంకా బాకీ ఎక్కడిదని మహిళలు బుక్‌కీపర్లను నిలదీశారు. తాము చిల్లిగవ్వ బాకీ లేమని క్లియరెన్స్ ఇచ్చే దాకా కదిలేది లేదని బ్యాంక్‌లో ఆందోళన చేశారు. ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి మాల్‌కు వెళ్తుండగా ఆయన కారును అడ్డగించడంతో ఎమ్మెల్యే బ్యాంక్‌కు వెళ్లి సూపర్‌వైజర్‌ను నిలదీశాడు. దీనిపై ఆయన సమాధానం చెప్పలేకపోయాడు. మహిళలకు న్యాయం చేయాలని ఎమ్మెల్యే సిబ్బందికి సూచించారు. బ్యాంక్ అధికారుల ప్రమేయంతో బుక్ కీపర్లు గ్రామంలోని 20కి పైగా పొదుపు సంఘాల మహిళల సంతకాలను ఫోర్జరీ చేసి నిధులు కాజేశారని సోమవారం సాయంత్రం చౌదర్‌పల్లి గ్రామానికి చెందిన పలువురు మహిళలు యాచారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై సీఐ నందీశ్వర్ రెడ్డి విచారణ చేపట్టారు. నిధుల స్వాహాపై బ్యాంక్ అధికారుల ప్రమేయంపై ఆరా తీస్తున్నారు. బుక్ కీపర్లు ఫోర్జరీ సంతకాలు చేశారా, లేదా అనే కోణంలో విచారణ చేపట్టారు. ఓ మహిళను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారణ చేస్తున్నట్లు సమాచారం.



భారీ జాతీయ జెండాతో విద్యార్థులు

కందుకూరులో తిరంగా ర్యాలీ

కందుకూరు, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ దేశభక్తిని పెంపొందించుకోవాలని బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, పార్టీ మహేశ్వరం ఇన్‌చార్జి అందెల శ్రీరాములు యాదవ్ అన్నారు. మంగళవారం బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి బి.దిలీప్, రాష్ట్ర స్పోర్ట్స్ సెల్ కన్వీనర్ ఊటు మహేందర్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో పలు పాఠశాలల విద్యార్థులతో తిరంగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ అనేగాని అశోక్‌గౌడ్, బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు నిమ్మ అంజిరెడ్డి, నాయకులు మంద పాండు, బక్క మల్లేశ్, కె.సుధాకర్ రెడ్డి, దయాకర్‌రెడ్డి, డి.అనీల్, తాళ్ల నరేందర్, అరుణ్, రవీందర్, శ్రీశైలం, రఘురాంరెడ్డి, జోనేష్, సంతోష్, సురేష్ పాల్గొన్నారు.

రైతులను అన్ని విధాలా ఆదుకుంటాం

- ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి



మాల్‌లో డీసీసీబీ బ్రాంచ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, డీసీసీబీ చైర్మన్ కొత్తకురుమ సత్తయ్య

యాచారం., ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): రైతులను అన్నివిధాలా ఆదుకుంటామని, రైతులు కోరిన వెంటనే రుణాలిచ్చి ఆదుకునేందుకు మాల్‌లో డీసీసీబీ బ్రాంచ్‌ను ప్రారంభిస్తున్నామని, సొసైటీ భవనం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. మంగళవారం యాచారం మండలం మాల్‌లో రూ.65లక్షలతో నిర్మించిన డీసీసీబీని, మండల కేంద్రంలో రూ.50లక్షలతో మరమ్మతులు చేసిన ప్రభుత్వాసుపత్రి భవనాన్ని, యాచారంలో రూ.40 లక్షలతో చేపట్టిన రహదారి పనులకు శంకుస్థాపన చేశారు. మేడిపల్లి, నానక్‌నగర్ గ్రామాల్లో రూ.10 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. లబ్ధిదారులకు రేషన్‌కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గత పాలకులు రూ7.50 లక్షల కోట్ల అప్పులు చేతికిస్తే వాటికి వడ్డీలు చెల్లిస్తూనే రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్నామన్నారు. రాజకీయాలకు అతీతంగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్నామని చెప్పారు. శ్రీశైలం-హైదరాబాద్, నాగార్జునసాగర్-హైదరాబాద్ రహదారులను కలిపే ప్రధాన లింకు రోడ్డును నాలుగులేన్ల రహదారిగా మార్చేందుకు కృషి చేస్తున్నామని, త్వరలోనే రోడ్డు విస్తరణ పనులు ప్రారంభించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. కార్యక్రమాలలో డీసీసీబీ చైర్మన్ కొత్తకురుమ సత్తయ్య, కందుకూరు సొసైటీ చైర్మన్ చంద్రశేఖర్, డీసీసీబీ అధికారులు నాగాంజలి, ప్రభాకర్‌రెడ్డి, యాచారం సీఈవో నాగరాజు, తహసీల్దార్ అయ్యప్ప, డిప్యూటీ తహసీల్దార్ కీర్తిసాగర్, ఎంపీడీవో రాధారాణి, మండల ప్రత్యేకాధికారి మాధవరావు, పంచాయతీ రాజ్ డీఈ శ్రీనివాస్, ఏఈ వంశి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ రాజు, ఎంపీవో శ్రీలత, మార్కెట్ కమిటీ చైర్మన్ కె.గురునాథ్‌రెడ్డి, డైరెక్టర్లు మస్కు నర్సింహ, ఎండీ అక్బర్, బీఎన్‌రెడ్డి ట్రస్ట్ చైర్మన్ బిలకంటి చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులు మంఖాల దాసు, సుదర్శన్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, రామకృష్ణయాదవ్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులున్నారు.

ఉపాధ్యాయ సమస్యలపై రాజీలేని పోరాటం



కొండారెడ్డిపల్లిలో సభ్యత్వం ఇస్తున్న గోవర్ధన్‌యాదవ్

కేశంపేట, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి):ఉపాధ్యాయుల సమస్యలపై పీఆర్‌టీయూ రాజీలేని పోరాటం చేస్తోందని పీఆర్‌టీయూ జిల్లా మాజీ అధ్యక్షుడు కె.గోవర్ధన్‌యాదవ్ అన్నారు. కేశంపేట, వేములనర్వ, పాపిరెడ్డిగూడ, కొండారెడ్డిపల్లి ప్రభుత్వ ప్రైమరీ, హైస్కూళ్లలో మంగళవారం యూనియన్ సభ్యత్వ నమోదును ప్రారంభించారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంపై వత్తిడి తెస్తామని తెలిపారు. రెండు సంవత్సరాలుగా జెడ్పీ జీపీఎఫ్ సరెండర్ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. మెడికల్ బిల్లులు రావడంలేదని, హెల్త్‌కార్డులు పనిచేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమాల్లో మండలశాఖ అధ్యక్షుడు కరుణాకర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళా సంఘాలను బలోపేతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీపీఎం నర్సింహులు

కొందుర్గు, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): మహిళా సంఘాలను బలోపేతం చేయాలని జిల్లా ప్రాజెక్టు మేనేజర్ నర్సింహులు అన్నారు. మంగళవారం కొందుర్గులోని మహిళా సమాఖ్య అధ్యక్షురాలు భారతమ్మ ఆధ్వర్యంలో సభ్యులకు ఒక రోజు శిక్షణ ఇచ్చారు. మేనేజర్ మాట్లాడుతూ.. నూతన సంఘాల ఏర్పాటుపై మహిళలకు అవగాహన కల్పించాలని సూచించారు. బ్యాంకు రుణాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీసీలు జంగయ్య, నర్సింహులు, లక్ష్మి, సరళ, వీఏవోలు పాల్గొన్నారు.


శంషాబాద్‌లో దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ కార్యకర్తలు

బీజేపీవి దిగజారుడు రాజకీయాలు

శంషాబాద్/ఆమనగల్లు, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ దిగజారుడు రాజకీయాలు చేస్తోందని శంషాబాద్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గడ్డం శేఖర్‌యాదవ్ అన్నారు. ఢిల్లీలో రాహుల్‌గాంధీని అరెస్టును నిరసిస్తూ మంగళవారం శంషాబాద్ నాయకులు కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మకు శవయాత్ర జరిపి అంబేద్కర్ చౌరస్తాలో దహనం చేశారు. దేశంలో ఎన్ని లక్షల ఓట్లు చోరీకి గురవుతున్నాయో, ఒకే వ్యక్తి వేర్వేరు చోట్ల ఎన్ని ఓట్లు ఉన్నాయో రాహుల్‌గాంధీ 70 నిమిషాలు వివరించారన్నారు. ఇలాంటి అవకతవకలపై రాహుల్‌గాంధీ కేంద్రఎన్నికల సంఘం అధికారులను కలిసేందుకు వెళ్తుంటే కేంద్ర ప్రభుత్వం రాహుల్‌ను అరెస్టు చేయించిందన్నారు. పీసీ ప్రధాన కార్యదర్శి సదాలక్ష్మి, ఎస్సీ విభాగం ఉపాధ్యక్షుడు నరేందర్, డీసీసీ నాయకురాలు సులోచన, గడ్డ విజయశేఖర్‌లు మాట్లాడుతూ.. బీజేపీ ఈవీఎం ఎత్తుగడలతో అధికారంలోకి వచ్చిందన్నారు. నాయకులు శ్రీధర్‌యాదవ్, సంజయ్‌యాదవ్, అక్రంఖాన్, గనీభాయ్, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు. ఆమనగల్లులో యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వస్పుల శ్రీకాంత్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. రాజీవ్ చౌక్‌వద్ద కాంగ్రెస్, యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యుఐ నాయకులు, కార్యకర్తలు బీజేపీకి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. కాంగ్రెస్ మండల, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు జగన్, మానయ్య, నాయకులు శ్రీకాంత్, శ్రీశైలం, మల్లయ్య, మైసయ్య, ఖాదర్, వెంకట్‌రెడ్డి, కృష్ణనాయక్, మహేశ్, కుమార్‌గౌడ్, అలీం, పర్వతాలు, కరీం, రాజు, అవినాశ్‌రెడ్డి, సురేశ్, ఫరీద్ పాల్గొన్నారు.


విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న సీఐ మహేందర్‌రెడ్డి తదితరులు

విద్యార్థులు స్నేహపూర్వకంగా మెలగాలి

ఇబ్రహీంపట్నం, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడకుండా స్నేహపూర్వకంగా మెలగాలని ఇబ్రహీంపట్నం సీఐ ఎం.మహేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఇబ్రహీంపట్నంలోని గురునానక్ విద్యా సంస్థల్లో యాంటీ రాగింగ్‌పై ఏర్పాటు చేసిన అవగాహనా కార్యక్రమంలో మాట్లాడారు. ర్యాగింగ్ వంటి కేసుల్లో ఇరుక్కుంటే వారి విద్యార్థి భవిష్యత్తు అంధకారమే అనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. తల్లిదండ్రులు ఎన్నో ఆశలతో తమ పిల్లలను చదివిస్తున్నారని, వారి కలలను సాకారం చేయాల్సిన బాధ్యత విద్యార్థులపై ఉందన్నారు. మత్తు పదార్థాలు, మద్యానికి దూరంగా ఉండాలన్నారు. ఎవరైనా తప్పుడు పనులకు పాల్పడితే వెంటనే పోలీసులకు సమాచారమివ్వాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై రామకృష్ణ, విద్యా సంస్థల జేడీ డా.పార్థసారథి, ప్రిన్సిపాల్ కె.వెంకట్రావు పాల్గొన్నారు.


సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త కేవీ.రావు

సాగులో శాస్త్ర సాంకేతికతను వినియోగించుకోవాలి

మంచాల, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): పంటల సాగులో రైతులు శాస్త్ర సాంకేతికతను వినియోగించుకోవాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు కేవీ.రావు, గిరిరాజ్ అమర్‌నాథ్‌లు రైతులకు సూచించారు. కృషి విజ్ఞాన కేంద్రం, నీటి నిర్వహణ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం మంచాలలో సుఖరక్షక ఏఐ ఫీల్డ్ కన్సల్టేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వర్షాభావ పరిస్థితుల అంచనా, ఏఐ ఆధారిత సలహాలు, సాగులో సమయానుకూల ప్రాముఖ్యంలపై వివరణాత్మక ప్రదర్శన ఏర్పాటుచేశారు. రైతుల సందేహాలను నివృత్తిచేశారు. కార్యక్రమంలో వ్యవసాయశాస్త్రవేత్తలు చంద్రకాంత్, ఎస్.విజయ్‌కుమార్, డి.సుధీర్, శ్రీకృష్ణ, ఏవో శ్రీలత, ఏఈవోలు లింగస్వామి, నిఖిత పాల్గొన్నారు.

గణేశ్ చవితిని శాంతియుతంగా జరుపుకోవాలి

శామీర్‌పేట, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి పండగను ప్రజలు శాంతియుతంగా జరుపుకోవాలని శామీర్‌పేట ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్ వినాయక మండప నిర్వాహకులకు సూచించారు. పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం మండపాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. మట్టి వినాయకులను ప్రతిష్ఠించాలని సూచించారు. మండపాల ఏర్పాటుకు అనుమతులు తప్పక తీసుకోవాలన్నారు. విద్యుత్ తీగలు, స్తంభాలు తగలకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐలు దశరథ, శశివర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా సూర్యగిరి ఎల్లమ్మ బోనాలు



తుక్కుగూడ మున్సిపాలిటీ పరిధి సూర్యగిరి ఎల్లమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు అమ్మవారికి అభిషేకాలు నిర్వహించి బోనాలు సమర్పించారు. రావిర్యాల, సర్దార్‌నగర్, తుక్కుగూడ, మంఖాల్, హర్షగూడ, ఆదిభట్ల, కొంగరకలాన్, ఇబ్రహీంపట్నం, సరూర్‌నగర్, ఇమాంగూడ, శ్రీనగర్ తదితర ప్రాంతాల నుంచి భక్తులు తరలొచ్చి ఎల్లమ్మకు మొక్కులు చెల్లించుకున్నారు. ఉత్సవాల్లో అమ్మవారి కల్యాణోత్సవం, ఘటాల ఊరేగింపు, పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలు, వీఐపీల సందడితో వైభవంగా కొనసాగాయి. ఎమ్మెల్యేలు సబితారెడ్డి, మల్లారెడ్డి, వివిధ పార్టీల నాయకులు అమ్మ వారికి పూజలు చేశారు. వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. వీఐపీలకు ఆలయ కమిటీ చైర్మన్ రెడ్డిగళ్ల రత్నం శాలువాలతో సత్కరించారు.

మహేశ్వరం, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి)


ఆలయంలో కొలువు దీరిన ఎల్లమ్మ తల్లి


పూజలకు హాజరైన ఎమ్మెల్యేలు సబితారెడ్డి, మల్లారెడ్డి

హిందూ ఉత్సవ కేంద్ర సమితి పూర్తి స్థాయి కార్యవర్గం

తాండూరు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): తాండూరు హిందూ ఉత్సవ కేంద్ర సమితి పూర్తి స్థాయి కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. హైదరాబాద్ రోడ్డు మార్గంలోని హిందూ ఉత్సవ సమితి స్థలం వద్ద ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి ప్రకటించారు. ఉపాధ్యక్షులుగా తర్లపల్లి భానుకుమార్, గొలి పరమేశ్, మణపురం రామకృష్ణ, బాతుల నాగరాజు, డి.శ్రీకాంత్‌రెడ్డి, అల్లాపురం శ్రీకాంత్, శ్రీకాంత్‌రెడ్డి, అంతారం రమేశ్, కొటం ప్రసాద్, సహ కార్యదర్శిగా పడమటి వెంకటేశం, అశోక్, కోట్ల రాజ్‌కుమార్, రాజేందర్‌రెడ్డి, హరి ప్రసాద్‌గౌడ్, లోకేశ్, సందీప్‌రెడ్డి, రజక నర్సింహ, వడ్డె పరమేశ్, అధికార ప్రతినిధిగా పర్యాద రామకృష్ణలను ఎన్నుకున్నారు. కార్యనిర్వాహక కార్యదర్శులుగా బోయ రాజు, అనిల్ గౌడ్, గోపాల్ చౌహాన్, సాంస్కృతిక కార్యదర్శులుగా దావులయ్య, తట్టేపల్లి నరేశ్, రమేశ్, సమన్వయ కమిటీ సభ్యులుగా జుంటుపల్లి వెంకట్, సురేశ్‌నాయక్, ఎస్.వెంకటేశ్, దివిటి ఎల్లప్ప, బీజే దత్తు, ప్రవీణ్, మధు, వసంత్, ప్రచార కార్యదర్శులుగా తాండ్ర నరేశ్, గోపాల్, న్యాయ సలహాదారులుగా పాశం రవికుమార్, మిస్కిన్ దేవరాజ్, ఆధ్యాత్మిక సలహాదారులుగా మడపతి సిద్ధిలింగయ్య ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షురాలు స్వప్నపరిమళ్, ప్రధాన కార్యదర్శి నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

బైపాస్ బాధితులకు పరిహారం చెల్లించండి

సీఎంను కోరిన ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): తాండూరులో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న బైపాస్ రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులకు పరిహారం నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరారు. ఆయన మంగళవారం ఆయన నివాసంలో కలిసి పలు అంశాలపై చర్చించారు.



సీఎంతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

పరిహారం చెల్లించకపోవడంతో పనులు జరగడం లేదని సీఎం దృష్టికి తీసుకెళ్లారు. రైతులకు నష్ట పరిహారంగా రూ.25 కోట్లు తక్షణం విడుదల చేయాలని ఆయన కోరినట్లు తెలిపారు. అలాగే కాగ్నా నదిలో ఉన్న తాగునీటి పైపులైన్ పునరుద్ధరణ కోసం రూ.50 కోట్లు మంజూరు చేయాలని కోరగా ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించి నిధులు మంజూరుకు హామీ ఇచ్చారని ఎమ్మెల్యే తెలిపారు.

ఘనంగా జాతీయ గ్రంథాలయ దినోత్సవం

కొడంగల్ రూరల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): కొడంగల్‌లో తెలంగాణ సాంఘిక సంక్షేమ పాఠశాల, కళాశాలలో జాతీయ గ్రంథాలయ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు.గ్రంథాలయ పితామహుడు ఎస్ఆర్. రంగనాథన్ జయంతిని పురస్కరించుకుని జాతీయ గంథాలయ దినోత్సం సందర్భంగా ఆయన చిత్రపటానికి కళాశాల ప్రిన్సిపాల్ రామదాసు, ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల గ్రంథాలయ పాలకుడు శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్ పద్మ పాల్గొన్నారు.


ఎస్ఆర్ రంగనాథన్‌కు నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

చదివితేనే భవిష్యత్తు


విద్యార్థులతో మాట్లాడుతున్న రాధికాగుప్తా

మేడ్చల్ టౌన్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు బాగా చదివితేనే బంగారు భవిష్యత్తు ఉంటుందని జిల్లా అదనపు కలెక్టర్ రాధికాగుప్తా అన్నారు. మంగళవారం ఆమె మేడ్చల్ సమీప కిష్టాపూర్‌లోని గురుకుల పాఠశాలను సందర్శించారు. పాఠశాల పరిసరాలను, వంట గదులను, తరగతి గదుల నిర్వహణ, విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలపై పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ... బాగా చదివి ఆశయాన్ని సాధించాలన్నారు. గురుకులాల విద్యార్థులకు ప్రభుత్వం అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తోందన్నారు. చదువులో వెనకపడకుండా ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలు ఎప్పటికప్పుడు సాధన చేసి పరీక్షల్లో బాగారాసి మంచి మార్కులు సాధించాలని చెప్పారు. విద్యార్థులు తెలిపిన పలు సమస్యలపై టీచర్లకు సూచనలు చేశారు. ఆమె వెంట అధికారి వినోద్‌కుమార్, ప్రిన్సిపాల్ ఉన్నారు.

ఉమ్మడి జిల్లాకు నేడు, రేపు
ఆరెంజ్ హెచ్చరికలు

- అక్కడక్కడ భారీ వర్షాలు
- బేగంపేట వాతావరణ శాఖ

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్‌లో మరో రెండురోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశముందని బేగంపేట వాతావరణశాఖ అధికారులు మంగళవారం హెచ్చరికలు జారీచేశారు. బుధ, గురువారాలు హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలకు వాతావరణ శాఖ ఆరెంజ్ హెచ్చరికలు జారీచేసింది. ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 40-50కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశాలుంటాయన్నారు. శుక్రవారం హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలకు వాతావరణశాఖ ఎల్లో హెచ్చరికలు జారీచేసింది. ఉపరితల గాలులు వాయువ్య దిశలో గంటకు 6-8 కిలోమీటర్ల వేగంతో వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు పేర్కొన్నారు.


విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ప్రజాసేవకే రాజకీయాల్లోకొచ్చా

- కల్వకుర్తి ఎమ్మెల్యే నారాయణరెడ్డి

ఆమనగల్లు, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): కల్వకుర్తి నియోజకవర్గ ప్రజలు తనకు ఎన్నికల్లో 70వేల ఓట్లు వేసి ఆదరించారని చెబుతున్న బీజేపీ నాయకుడు తల్లోజు ఆచారికి ఈ ప్రాంత అభివృద్ధిపై బాధ్యత లేదా? అని కల్వకుర్తి ఎమ్మెల్యే నారాయణరెడ్డి ప్రశ్నించారు. ఆమనగల్లులోని కల్యాణి గార్డెన్‌లో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో స్థానిక నాయకులతో కలిసి మాట్లాడారు. ప్రజాసేవ కోసమే తాను రాజకీయాల్లోకొచ్చానన్నారు. తనకు ఎవరిపైనా ఈర్ష్యా, ద్వేషాలు లేవని చెప్పారు. ఆమనగల్లులో బీజేపీ ధర్నాలో ఆచారి.. తనను, సీఎం రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి సంస్కారం లేకుండా ఏకవచనంతో మాట్లాడటం పద్ధతి కాదన్నారు. తామిద్దరం ఒకే పాఠశాలలో చదువుకున్నామని, తమ గురువులు ఒక్కరేనని.. ఆచారి మాత్రం సంస్కారహీనంగా మాట్లాడారని విమర్శించారు. తామేం చేస్తున్నామో తెలుసుకోకుండా ఆరోపణలు చేయడం తగదన్నారు. సీఎం సహకారంతో రోడ్ల అభివృద్ధికి రూ.600కోట్లు సాధించానని చెప్పారు. జంగారెడ్డిపల్లి-చంద్రాయన్‌పల్లి బీటీ రోడ్డు వెడల్పునకు నిధులు మంజూరయ్యాయని, త్వరలోనే టెండర్లు నిర్వహిస్తామన్నారు. అభివృద్ధి విషయంలో ఆచారి కలసిరావాలని, కేంద్ర నిధుల సాధనకు తన బాధ్యతగా పనిచేయాలని ఎమ్మెల్యే హితవు పలికారు. ఆయన ఇంటీరియల్ రోడ్లకు రూ.వెయ్యి కోట్లు, హైదరాబాద్-శ్రీశైలం హైవే ఆరు లేన్ల విస్తరణకు కేంద్ర ప్రభుత్వ నిధులు తెస్తే ఎయిర్ పోర్టులోనే ఘనస్వాగతం పలుకుతామని నారాయణరెడ్డి అన్నారు. సీఎం, ఎమ్మెల్యేను కించపరుస్తూ మాట్లాడిన ఆచారి క్షమాపణ చెప్పాలని పీసీసీ అధికార ప్రతినిధి బాలాజీసింగ్ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, మార్కెట్ మాజీ చైర్మన్ భట్టు కిషన్‌రెడ్డి, వైస్‌చైర్మన్ కేశవులు, గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మనాయక్, మాజీ జెడ్పీటీసీ శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, డీసీసీ అధికారప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు బిక్యానాయక్, వెంకటేశ్వర్లుగౌడ్, అనంతరెడ్డి, జగన్, మానయ్య, శ్రీనివాస్‌గౌడ్, కె.శ్రీనివాస్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, సాయిరెడ్డి, కాలె మల్లయ్య, అంజన్‌రెడ్డి, కృష్ణానాయక్, అలీం, ఖాదర్ ఖాద్రి, మైసయ్య, దళపతిగౌడ్, బాబ, జగన్, శివలింగం, బల్‌రామ్, మహేశ్, టి.రవీందర్ పాల్గొన్నారు.

మిర్జాపూర్‌లో ప్రజాభిప్రాయ సేకరణ


ప్రజాభిప్రాయ సేకరణలో మాట్లాడుతున్న లింగ్యానాయక్

పూడూరు, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని మిర్జాపూర్‌లో మంగళవారం పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్ స్థానికుల అభిప్రాయాన్ని సేకరించారు. ఆయన మాట్లాడుతూ.. మిర్జాపూర్‌లోని సర్వే నంబర్.17/ఇ, 17/ఎ, 17ఇఇ/1/1లలో రెక్సిన్ తయారీకి మెస్సర్ సుందర్ సింథటిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ఫ్యాక్టరీని ఏర్పాటు చేయదలిచిందన్నారు. అయితే ఫ్యాక్టరీ ఏర్పాటును కొందరు వ్యతిరేకిస్తున్నారని, అందుకే ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టామని తెలిపారు. ప్రజాభిప్రాయ నివేదికను తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలికి పంపిస్తామని తెలిపారు. గ్రామస్థులు అడిషనల్ కలెక్టర్, ఆర్డీవో వాసుచంద్రలను కలిసి ఫ్యాక్టరీ పెడితే పంట నష్టంతోపాటు, చుట్టుపక్కల కాలుష్యంతో ప్రజారోగ్య సమస్యలు తలెత్తుతాయని, ఫ్యాక్టరీ ఏర్పాటు యోచనను విరమించుకోవాలని వినతిపత్రం ఇచ్చారు. రెండు రోజులపాటు పోలీసు బందోబస్తు మధ్య ప్రజాభిప్రాయ సేకరణ సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ భరత్‌కుమార్, ఫ్యాక్టరీ జీఎం మహేశ్, గ్రామస్థులు పాల్గొన్నారు.


విద్యుత్ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

విద్యుత్ సరఫరాలో ఇబ్బందులుండొద్దు : ఎమ్మెల్యే

పరిగి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సరఫరాలో ఇబ్బందుల్లేకుండా చూడాలని పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అధికారులకు సూచించారు. మంగళవారం పరిగిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. పూడూరు, దోమ, పరిగి, కులకచర్ల, చౌడాపూర్ మండలాల్లోని విద్యుత్ సమస్యలపై చర్చించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. లో ఓల్టేజీ సమస్య ఉన్న ప్రాంతాలకు అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలన్నారు. 33/11కేవీ సబ్‌స్టేషన్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. సమావేశంలో ట్రాన్స్‌కో ఎస్ఈ రవిప్రసాద్, డీఈఈ సంజీవ్, ఏడీఈ వెంకటనాయుడు, ఏఈలు హరికృష్ణ, వినయ్‌కాంద్, మోతీలాల్, రాజునాయక్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

దోమ: ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే అన్నారు. రాకొండకు చెందిన మజ్జిగ శివకుమార్‌కు వైద్యం కోసం మంజూరైన రూ.2.5లక్షల చెక్కును స్థానిక నాయకులతో కలిసి కుటుంబీకులకు అందజేశారు. లాల్‌కృష్ణ పాల్గొన్నారు.

మెరిట్ విద్యార్థులకు తోడ్పాటు

కందుకూరు,ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): విద్యారంగంలో ఉత్తమ ఫలితాలు సాధిస్తున్న విద్యార్థులకు గోరుతి ఈశ్వర ట్రస్ట్ తోడ్పాటును అందిస్తుందని బాధ్యులు బూచిరెడ్డి శ్రీనాథ్‌రెడ్డి, పి.తిరుపతిరెడ్డి, జయచంద్రారెడ్డిలు అన్నారు. ఆకుల మైలారం పాఠశాలలో టెన్త్‌లో మంచి మార్కులు సాధించిన విద్యార్థిని రోజాకు మంగళవారం రూ.15వేల చెక్కును అందజేశారు. తమ ట్రస్ట్ ద్వారా 15ఏళ్లుగా ఆకులమైలారం పాఠశాల విద్యార్థులకు నగదు బహుమతిని ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యుడు డి.రామకృష్ణారెడ్డి, హెచ్ఎం వనజకుమారి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు వృత్తి, సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకోవాలని అనురాగ్ యూనివర్సిటీ బీబీఏ ప్రోగ్రాం డైరెక్టర్ శివప్రియ అన్నారు. వెంకటాపూర్‌లోని అనురాగ్ యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన ఓరియంటేషన్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో డీన్ బాలాజీ ఉట్ల, సలహాదారు పీఎస్ఎస్ మూర్తి, విష్ణుచందన, మహిపతి శ్రీనివాస్‌రావు, విద్యార్థులు పాల్గొన్నారు.


ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డికి వినతి పత్రం ఇస్తున్న రైతులు

చావడానికైనా సిద్ధం.. పొలాలివ్వం

ఆర్డీవోకు కడ్తాల్ మండల రైతుల మొర

కందుకూరు, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): తమ భూములను కాపాడుకునేందుకు చావడానికైనా సిద్ధమని, కానీ హైటెన్షన్ లైన్‌కు భూములు ఇవ్వం అని కడ్తాల్ మండలంలోని పలు గ్రామాల రైతులు అన్నారు. మండల పరిధి గ్రామాల నుంచి పోతున్న హైటెన్షన్ లైన్‌ను రద్దు చేయాలని వారు మంగళవారం ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. రైతులు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం బీదర్ నుంచి మహేశ్వరం పవర్ గ్రిడ్(మీర్కాన్‌పేట) వరకు 765కేవీ హైటెన్షన్ లైన్‌ను మంజూరు చేసిందని, కాంట్రాక్టర్ సమాచారం ఇవ్వకుండానే తమ పొలాల్లో హైటెన్షన్ స్తంభాలను పాతడం ఏమిటని రైతులన్నారు. దీంతో ఆర్డీవో స్పందించి రైతులు, హైటెన్షన్ లైన్ పనుల కాంట్రాక్టర్‌తో ఎంపీడీవో కార్యాలయంలో సమావేశాన్ని ఏర్పాటు చేసి సమస్యలపై అడిగి తెలుసుకున్నారు. గెజిట్ ఆఫ్ ఇండియా ప్రకారం ఒక ప్రాజెక్టును ప్రారంభించాలంటే స్థానికుల ఆమోదం, పంచాయతీ తీర్మానం, అధికారుల ఆమోదంతో పనులు చేయాలని, కానీ కాంట్రాక్టర్ అవేమీ పాటించడం లేదని రైతులు మొర పెట్టుకున్నారు. పవర్‌గ్రిడ్ అధికారులు ఆర్డీవో, కలెక్టర్‌కు తప్పుడు సమాచారమిచ్చి తమకు అన్యాయం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరారు. కార్యక్రమంలో కడ్తాల్ మాజీ సర్పంచ్ జి.లక్ష్మీనర్సింహారెడ్డి, మాజీ ఉపసర్పంచ్ కె.రామకృష్ణ, యువజన సంఘాల అధ్యక్షుడు ఎ.రాఘవేందర్, బీసీ సంఘం మండల అధ్యక్షుడు పి.వెంకటేష్, రైతులు శివరామకృష్ణ, పర్వత్‌కుమార్, పెంటారెడ్డి, జి.కృష్ణ, అభిషేక్ రెడ్డి, జి.రాజేందర్‌యాదవ్, మహేష్, కేశవులు గౌడ్, కుమార్, కె.సత్యనారాయణ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యా హక్కు చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి

వికారాబాద్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): విద్యాహక్కు చట్టం కేవలం 32శాతం మాత్రమే అమలవుతోందని సాధన ఎన్జీవో డైరెక్టర్ చిక్కు మురళీమోహన్ అన్నారు. మంగళవారం డైట్ కళాశాలలో బాలల హక్కులు, విద్యా సామర్థ్యాలపై అవగాహన కార్యక్రమంలో మాట్లాడిన ఆయన, చట్టం పటిష్ఠ అమలుకు పంచవర్ష ప్రణాళిక, బాలలపై సమగ్ర సర్వే, ప్రాథమిక, మాధ్యమిక విద్యకు 10శాతం బడ్జెట్ నిధుల కేటాయింపు అవసరమన్నారు. 18ఏళ్లలోపు అందరికీ ఉచిత, నిర్బంధ విద్య అందేలా చట్ట సవరణ చేయాలని చెప్పారు. ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయాలని, పిల్లలు లేరనే సాకుతో సర్కారు బడుల మూసివేతలను ఆపాలని కోరారు. 3 నుంచి 9 తరగతుల విద్యార్థులకు రెమీడియల్ టీచింగ్, ఉపాధ్యాయులకు స్వయంప్రతిపత్తి కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా కో-ఆర్డినేటర్ రమేష్‌యాదవ్, ఎహెచ్‌టీయూ హెడ్‌కానిస్టేబుల్ అలీమొద్దీన్, అసిస్టెంట్ కోఆర్డినేటర్ నర్సింహులు, సఖీ సెంటర్ కో-ఆర్డినేటర్ యశోద, లీగల్ కౌన్సిలర్ సుమలత, షీ టీం ప్రతినిధి రేష్మ, డైట్ సూపరింటెండెంట్ హస్సేన్ సయ్యద్, ధారూర్ మాజీ సర్పంచ్ చంద్రమౌళి, సంస్థ ప్రతినిధులు అంజయ్య, ఆసీమ, రోజా, ప్రకాశ్ పాల్గొన్నారు.


అవగాహన పోస్టర్లను విడుదల చేస్తున్న సాధన కమిటీ


మాట్లాడుతున్న కేఎస్ రత్నం

బీజేపీతోనే రాష్ట్రాభివృద్ధి

షాబాద్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): బీజేపీతోనే తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, రాష్ట్ర కార్యవర్గసభ్యుడు ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని తిమ్మారెడ్డిగూడ, మద్దూర్, కేశవగూడ, అంతారం గ్రామాల్లో బూత్ కమిటీ సమావేశాల్లో పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ బీజేపీకి ప్రజల్లో మంచి ఆదరణ ఉందని, స్థానిక సంస్థల ఎన్నికల్లో మండలంలో అన్ని గ్రామాల్లో పోటీచేసి సత్తా చాటాలన్నారు. మండలాధ్యక్షుడు మాణయ్య, ప్రధాన కార్యదర్శి హరీష్ వివిధ బూత్‌స్థాయి అధ్యక్షులు, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలి

షాద్‌నగర్ రూరల్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): రైతుబీమాకు దరఖాస్తు చేసుకోని రైతులు వెంటనే చేసుకోవాలని షాద్‌నగర్ ఏడీఏ రమాదేవి తెలిపారు. ఏడీఏ కార్యాలయంలో మంగళవారం రైతులకు మంగళవారం రైతుబీమా ధ్రువపత్రాలందించారు. 18ఏళ్ల నిండి 59 ఏళ్లవయస్సు కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

వైభవంగా ఎల్లమ్మ బోనాలు

● అమ్మవారికి నైవేద్యం సమర్పించిన గ్రామస్తులు

కొందుర్గు, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఎల్లమ్మ బోనాలను వైభవంగా నిర్వహించారు. మంగళవారం ఉదయం నుంచే ఎల్లమ్మ తల్లికి పసుపు, కుంకుమ, వేపాకులతో నైవేద్యం సమర్పించి మహిళలు మొక్కులు చెల్లించుకున్నారు. లక్ష్మీనరసింహస్వామి ఆలయ కమిటీ చైర్మన్ కృష్ణయ్య, రాములుగౌడ్, జీబీ కృష్ణ, కొమరబండ శ్రీశైలం, అనిల్‌గౌడ్, భరత్, జగదీశ్వర్‌గౌడ్, శ్యాంగౌడ్, మహిళలు పాల్గొన్నారు.


కొందుర్గు : ఎల్లమ్మ ఆలయానికి బోనాలతో తరలిన మహిళలు

ఘనంగా హనుమాన్ ఆలయ వార్షికోత్సవం

చేవెళ్ల : మున్సిపాలిటీ పరిధిలోని మల్లారెడ్డిగూడ అభయాంజనేయ స్వామి దేవాలయం ఐదో వార్షికోత్సవం మంగళవారం కనుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు దేవాలయంలో వేదపండితుల సమక్షంలో హోమాలు నిర్వహించారు. పలువురు దంపతులు పాల్గొన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక పూజలు చేశారు. దైవనామస్మరణతో గ్రామం మారుమోగింది. మల్లారెడ్డిగూడ గ్రామస్తులతోపాటు చుట్టుపక్కల గ్రామల ప్రజలు పెద్దసంఖ్యలో తరలివచ్చి అభయ అంజనేయ స్వామి ఆశీర్వాదం తీసుకున్నారు. చేవెళ్ల సీఐ భూపాల్ శ్రీధర్, ఎస్సై శిరీష, పీఏసీఎస్ చైర్మన్లు దేవర వెంకట్‌రెడ్డి, గోనె ప్రతాప్‌రెడ్డి, వైస్ చైర్మన్ ఎర్ర మల్లేష్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు పాండుయాదవ్, జె.లక్ష్మారెడ్డి, సీనియర్ నాయకులు మర్పల్లి కృష్ణారెడ్డి, బల్వంత్‌రెడ్డి, మల్గారి మాధవరెడ్డి, కృష్ణ, కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల మున్సిపల్ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, మాజీ సర్పంచ్ మోహన్‌రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ రాధిక వెంకటేశ్‌లు, సీపీఐ మండల కార్యదర్శి మల్గారి సత్తిరెడ్డి, చేవెళ్ల మాజీ ఎంపీటీసీ రాములు, గ్రామస్తులు, భక్తులు తదితరులు ఉన్నారు.

ముగిసిన శ్రావణమాస పూజలు

చౌదరిగూడ : ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని, ప్రతి ఒక్కరూ అధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని మహామంత్రి సర్వదేశ్విక్ తెలంగాణ రాష్ట్ర ఆర్య ప్రతినిధి విఠల్‌రావు ఆర్య సూచించారు. మంగళవారం జిల్లేడ్ చౌదరిగూడ మండల కేంద్రంలోని ఆర్య సమాజ్‌లో మూడు రోజులుగా నిర్వహిస్తున్న 46వ శ్రావణ వేద ప్రచార సత్సంగం ముగింపు కార్యక్రమానిక ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ దైనందిన జీవితంలో ప్రజలు ఒత్తిడికి గురికాకుండా ధర్మకార్యాల్లో పాల్గొనాలని, సమాజనికి మేలు జరిగేలా పూజాధికాలు, యజ్ఞయాగాలు ఆధ్యాత్మికత పెంపొదించే కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. యజ్ఞబ్రహ్మాలు అరవిందశాస్త్రి, వసుధాశాస్త్రి, బీఏపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందె బాబయ్య, మాజీ సర్పంచ్ భూపాలచారి, బీజేపీ కొందుర్గు మండల అధ్యక్షుడు చిట్టెం లక్ష్మీకాంత్ రెడ్డి, ఆర్యప్రతినిధి సభ్యులు మచ్చసుధాకర్ రావు, శివకుమార్, కొనేరి శ్రీనివాస్, కొనేరి నర్సింగ్ రావు, ఆకారపు నాగరాజు, బస్వరాజ్, చిన్నయ్య, బల్వంత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


చేవెళ్ల : పూజలో ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు

క్రైం కార్నర్

వాహనం ఢీకొని వ్యక్తి మృతి

ఇబ్రహీంపట్నం, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధి ఎలిమినేడు వద్ద సోమవారం రాత్రి గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో మోటార్ సైకిల్ వెళ్తున్న ఒకరు తీవ్రగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ అదే రాత్రి మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. కందుకూరు మండలం కొలన్‌గూడకు చెందిన ఆదర్ల మారేష్ ఖన్న(52) శేరిగూడ హ్యుందాయ్ షోరూంలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. సోమవారం రాత్రి డ్యూటీ ముగించుకుని కొలన్‌గూడకు వెళ్తుండగా ఎలిమినేడు దాటిన తర్వాత రాత్రి 8గంటల సమయంలో అతని మోటార్ సైకిల్‌ను గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. దాంతో తీవ్రంగా గాయపడ్డ మారేష్‌ను ఇబ్రహీంపట్నంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుఎని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రామకృష్ణ తెలిపారు.

చికిత్స పొందుతూ మరొకరు..

మాడ్గుల, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): చేసిన అప్పులు తీర్చలేక పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ వ్యక్తి మృతిచెందాడు. ఎస్సై నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని దొడ్లపహాడ్‌కు చెందిన పాలకూర్ల జంగయ్య(40)ఆటో డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. కొన్నిరోజుల నుంచి చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక మానసికంగా బాధపడేవాడు. ఈక్రమంలో జీవితంపై విరక్తి చెంది సోమవారం పొలం వద్దకు వెళ్లి పురుగుల మందు తాగాడు. తన తమ్ముడు వెంకటయ్యకు ఫోన్ చేసి పొలం వద్ద పురుగుల మందు తాగానని, తన కూతురిని మంచిగా చూసుకోవాలని చెప్పాడు. వెంటనే జంగయ్య తమ్ముడు వెంకటయ్య, ముచ్చర్ల జంగయ్య, కుమారుడు విఘ్నేష్‌లు పొలం వద్దకు జంగయ్యను కారులో ఆమనగల్లు ప్రభుత్వ ఆస్పతికి తరలించారు. పరిస్థితి విషమించడంతో కల్వకుర్తికి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మంగళవారం శవపరీక్ష నిమి త్తం కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి మృతదేహాన్ని తరలించారు. ఈమేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

కోర్టుకు హాజరుకాని వ్యక్తి రిమాండ్

కడ్తాల్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నార్లకుంట తండాకు చెందిన జటావత్ శ్రీను(29)కు ఆమనగల్లు సివిల్ కోర్టు 14 రోజులు రిమాండ్ విధించింది. 2019లో తన భార్య రజిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది. దీంతో శ్రీను కోర్టు వాయిదాలకు హాజరుకాలేదు. మంగళవారం ఆమనగల్లు సివిల్ కోర్టు 14 రోజుల రిమాండ్ విధించిందని సీఐ గంగాధర్ పేర్కొన్నారు. కోర్టు ఉత్తర్వుల మేరకు చంచల్‌గూడ జైలుకు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు.

కుక్కల దాడిలో పలువురికి గాయాలు

షాబాద్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): సర్దార్‌నగర్‌లో పగలు, రాత్రివేళ వీధికుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. పదుల సంఖ్యలో రోడ్డుపైకి చేరి నడుచుకుంటూ, బైక్‌లపై వెళ్లేవారి వెంటపడుతున్నాయి. మంగళవారం సర్దార్‌నగర్‌లో పట్టపగలు ఏడుగురిని కరవడంతో షాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. పనులకెళ్లిన రైతులను వీధికుక్కలు వెంటపడి దాడి చేస్తున్నాయని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వివాహిత అదృశ్యం


గీత

కేశంపేట, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): వివాహిత అదృశ్యమైన ఘటన మండలంలోని లేమామిడిలో మంగళవారం వెలుగుచూసింది. సీఐ నరహరి కథనం మేరకు.. గ్రామానికి చెందిన సంపంగి మల్లేష్‌కు గతేడాది ఏప్రిల్‌లో నాగర్‌కర్నూల్ జిల్లా, కల్వకుర్తి మండలం, సిలార్‌పల్లికి చెందిన గీత(21)తో వివాహం జరిగింది. ఈ నెల 8న రాఖీ పండుగను పురస్కరించుకుని పుటింటికి వెళ్తానని చెప్పి వెళ్లి పోయింది. అదేరోజు సాయంత్రం మల్లేష్ తన మామ రాములుకు ఫోన్ చేసి ఇంటికి వచ్చిందా? అని అడగగా రాలేదని సమాధానమిచ్చాడు. కాగా, గతంలో ఓ వ్యక్తితో బయటకు వెళ్లిందని, ఆ వ్యక్తిపై అనుమానం ఉన్నట్లు భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రూ.25 కోట్లతో మున్సిపాలిటీ సమగ్రాభివృద్ధి


వాటర్ ట్యాంక్‌ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీల సమగ్రాభివృద్ధి, ప్రజలకు మెరుగైన మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పథకాలు రూపొందించి అమలు చేస్తుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ఆమనగల్లు మున్సిపాలిటీలో రూ.25 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టడానికి ప్రణాళికలు రూపకల్పన చేశామని, ఇప్పటికే రూ.10 కోట్ల పనులకు టెండర్ల ప్రక్రియ చేపట్టడం జరిగిందని, మరో రూ.15 కోట్ల మంజూరుకు సీఎం రేవంత్ రెడ్డి అంగీకరించారని వెల్లడించారు. ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలో అమృత్ 2.0 పథకంలో భాగంగా రూ.32 కోట్లతో నూతనంగా నిర్మించే 5 వాటర్ ట్యాంక్‌లు, పైపులైన్ల నిర్మాణానికి మంగళవారం మార్కెట్ చైర్‌పర్సన్ గీతనర్సింహ, పీసీసీ అధికార ప్రతినిధి బాలాజీసింగ్, పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ భట్టు కిషన్‌రెడ్డి, వైస్ చైర్మన్ గుర్రం కేశవులు, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ జక్కు అనంతరెడ్డి లతో కలిసి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ముర్తోజుపల్లి, జంగారెడ్డిపల్లిలో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకొని వాటిపరిష్కారానికి ప్రభుత్వ పరంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మున్సిపల్ కమిషనర్ శంకర్ నాయక్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ మున్సిపాలిటీ ఆశించిన అభివృద్ధికి నోచుకోలేదని, అందుకే ప్రత్యేక నిధుల కేటాయింపునకు సీఎం రేవంత్ రెడ్డిని అభ్యర్థించగా సానుకూలంగా స్పందించినట్లు చెప్పారు. ఇన్‌చార్జి ఎంపీడీవో రెహమాన్, ఈఈ ప్రభాకర్‌రెడ్డి, డీఈ యాదయ్య, మాజీ ఎంపీపీలు ధనుంజయ్య, అనితా విజయ్, నాయకులు యాట నర్సింహ, మండ్లీ రాములు, కల్లు రమణారెడ్డి, జగన్, మానయ్య, నిట్టనారాయణ, కానుగుల దశరథం, ఫరీద్, కొండల్‌రెడ్డి, బీక్యనాయక్, బీచ్యనాయక్, వస్పుల శ్రీకాంత్, శ్రీశైలం, కర్నాటి శ్రీదర్‌రెడ్డి, కొండల్‌రెడ్డి, కాసు శ్రీనివాస్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, బొజ్జ సాయిరెడ్డి, కసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, కాలె మల్లయ్య, అంజన్‌రెడ్డి, కొండల్‌రెడ్డి, వెంకటేశ్వర్లుగౌడ్, కృష్ణనాయక్, తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ : ఏసీపీ


సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న ఏసీపీ లక్ష్మీనారాయణ

షాద్‌నగర్ రూరల్, ఆగస్టు12(ఆంధ్రజ్యోతి): సీసీ కెమెరాలతో నేరాలు నియంత్రించవచ్చని, ప్రతీ గ్రామంలో ఏర్పాటు చేసుకోవాలని షాద్‌నగర్ ఏసీపీ లక్ష్మీనారాయణ తెలిపారు. ఫరూఖ్‌నగర్ మండలం కాశిరెడ్డిగూడలో దాత కిరణ్ కుమార్, గ్రామస్తులు, యువకుల సహకారంతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన గామస్తులను అభినందించారు. అలాగే దాతను సన్మానించారు.

సిబ్బంది లేక ఇబ్బంది

(ఐదో పేజీ తరువాయి)

జరిగేవి. వైద్యులు అందుబాటులో లేకపోవడం వల్ల ప్రస్తుతం 60 నుంచి 80 వరకు మాత్రమే కాన్పులు జరుగుతున్నాయి. ఆస్పత్రిలో గంటల తరబడి నిరీక్షించే ఓపిక లేక పెద్ద ఎత్తున గర్భిణులు ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయిస్తూ రూ.వేలు ఖర్చు చేసుకుంటున్నారు. ప్రతీ సోమవారం, బుధవారం వైద్య పరీక్షల కోసం వచ్చే గర్భిణులు ప్రస్తుతం 50 నుంచి 60 మంది మాత్రమే వస్తున్నట్లు సమచారం. షాద్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని కేశంపేట, కొందుర్గు, చించోడు, నందిగామ, కొత్తూరులోని పీహెచ్‌సీలలో సాధారణ కాన్పులు మాత్రమే నిర్వహిస్తున్నారు. సిజేరియన్ అవసరం ఉన్న వారిని షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలిస్తున్నారు. ఆయా పీహెచ్‌సీలలో నెలకు కేవలం పది లోపే కాన్పులు జరుగుతున్నాయి.

వైద్య సిబ్బంది కొరత కూడా..

కమ్యూనిటీ ఆస్పత్రిలో వైద్య సిబ్బంది కొరత కూడా వేధిస్తుంది. 45 మంది సిబ్బంది అవసరం ఉండగా కేవలం 24 మంది మాత్రమే ఉన్నారని వైద్య సిబ్బంది తెలిపారు. ప్రస్తుతం కమ్యూనిటీ ఆస్పత్రిలో నాలుగు ఏఎన్ఎం పోస్టులు ఉండగా అందులో ఇద్దరు ప్రమోషన్‌పై వెళ్లారు. అలాగే ముగ్గురు స్టాఫ్ నర్సులకు ఇద్దరు మాత్రమే అందుబాటులో ఉన్నారు. సిబ్బంది కొరతతో రోగులకు సరైన వైద్యమందించడంలో ఇబ్బందులు వస్తున్నాయని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రి 50నుంచి 100పడకల ఆస్పత్రిగా ఉన్నతీకరించినా వైద్యల కొరత మాత్రం తీరడం లేదు.

పర్యవేక్షణ లేక పరేషాన్

(ఐదో పేజీ తరువాయి)

లేకుండానే హాస్టళ్లు కొనసాగుతుండడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రైవేటు హాస్టళ్ల నిర్వహణ తీరుపై పాలసీ రూపొందించి సురక్షితమైన, నాణ్యమైన హాస్టల్ సదుపాయాలను కల్పించాలని కోరుతున్నారు.

అసాంఘిక కార్యకలపాలకు అడ్డాగా అజీజ్‌నగర్ చౌరస్తా

నగర శివారు మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని అజీజ్‌నగర్ చౌరస్తా వద్ద ఓ ఇంజినీరింగ్ కళాశాల ఉంది. ఈ కళాశాల పరిసరాల్లో పదుల సంఖ్యలో అనేక ప్రైవేటు హాస్టళ్లు వెలిశాయి. వీటికి ఎటువంటి అనుమతులు లేవు. ఒక్క హాస్టల్‌లో దాదాపు 100 నుంచి 200 మంది విద్యార్థులకు ఆశ్రయం కల్పిస్తున్నారు. దీంతో ఈ పరిసరాలు నిత్యం అసాంఘిక కార్యకలపాలకు అడ్డగా మారాయి. హాస్టల్లో ఉండే యువతీ, యువకులు రాత్రి, పగలు అనే తేడా లేకుండా పరిసర ప్రాంతాల్లో సంచరిస్తుండడం.. అసాంఘిక కార్యకలపాలకు పాల్పడుతుండడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. అనధికారికంగా కొనసాగుతున్న ఈ హాస్టళ్లను పట్టించుకోకపోవడం, పోలీసులు గస్తీ నిర్వహించకపోవడంతో ఈ ప్రాంతంలో పరిస్థితి దారుణంగా తయారైంది. అంతేకాకుండా అమ్దాపూర్ చౌరస్తా వద్ద ఓ ప్రముఖ ఇంజినీరింగ్ కళాశాల ఉంది. దీని పరిసరాల్లో కూడా పదుల సంఖ్యలో హాస్టళ్లు వెలిశాయి. ఇక్కడ కూడా ఎలాంటి అనుమతులు లేకుండా నిబంధనలకు విరుద్ధంగా హాస్టళ్లు కొనసాగుతున్నాయి. ఈ పరిసరాల్లో కూడా అసాంఘిక కార్యకలాపాలు నిత్యం జరుగుతున్నాయి. యువతీయువకులు రోడ్లపైకి వచ్చిన హల్‌చల్ చేస్తుండడంతో స్థానికులు ఇ బ్బందులు పడుతున్నారు. చదువుకునేందుకు వచ్చే యువతీయువకులు ఇష్టానుసారంగా బహిరంగ ప్రదేశాల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నా పట్టించుకునేవారే కరువయ్యారు.

జాతీయ నేతల అడుగు జాడల్లో నడుద్దాం

షాద్‌నగర్ అర్బన్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): దేశం కోసం పోరాటం చేసి, స్వాతంత్ర్యాన్ని సాధించి పెట్టిన జాతీయ నేతల అడుగు జాడల్లో ప్రతీఒక్కరు నడువాల్సిన అవసరం ఉందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందె బాబయ్య పిలుపునిచ్చారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురష్కరించుకుని మంగళవారం బీజేపీ పట్టణ శాఖ అధ్యక్షుడు హరిభూషన్ పటేల్ ఆధ్వర్యంలో షాద్‌నగర్ మున్సిపాలిటీలోని జాతీయ నేతల విగ్రహాలను శుభ్రం చేశారు. ఫరూఖ్‌నగర్ గ్రామంలోని గాంధీ విగ్రహంతో పాటు పట్టణంలోని సుభాష్‌చంద్ర బోస్, అంబేద్కర్ తదితర నేతల విగ్రహాలను నీటితో కడిగి శుభ్రం చేసి, పూలమాలవేసి నివాళులర్పించారు. చెట్ల వెంకటేష్, ఆంజనేయులు, మఠం ఋషికేష్, ప్యా ట అశోక్, వంశీకృష్ణ, ఎం.మురళి, నర్సింహులు, కాసోజు శివ, మంగ విజయ్, శివశంకర్, జి.రమేష్, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.


గాంధీ విగ్రహాన్ని శుభ్రంచేసి నివాళులర్పిస్తున్న నాయకులు

ప్రజా సమస్యలపై నిరంతర పోరాటాలు : ఆచారి

తలకొండపల్లి, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలపై బీజేపీ నిరంతరం ప్రజల పక్షాన పోరాటాలు కొనసాగిస్తుందని ఎన్‌బీసీ మాజీ సభ్యుడు, బీజేపీ రాష్ట్ర నాయకుడు తల్లోజు ఆచారి అన్నారు. హామీల అమలుపై రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీయాలని ఆయన పిలుపు నిచ్చారు. గట్టిప్పలపల్లిలో బ్యాంక్ ఏర్పాటుకు కృషి చేసిన ఆచారికి మంగళవారం అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. పూలమాలలు, శాలువాలతో బీజేపీ నాయకులు సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. హామీల అమలులో కాంగ్రెస్ విఫలమైందన్నారు.

పాడి పరిశ్రమకు పెద్దపీట

ఆమనగల్లు, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): రైతులు వ్యవసాయానికి అనుబంధంగా పాడి పరిశ్రమను చేపట్టి ఆర్థికంగా అభివృద్ధి చెందాలని, ప్రభుత్వం పాడి పరిశ్రమకు పెద్దపీట వేస్తుందని ఆమనగల్లు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ యాట గీతనర్సింహ అన్నారు. ఆమనగల్లు మున్సిపాలిటీ జంగారెడ్డిపల్లిలో మంగళవారం విజయ పాల సేకరణ కేంద్రాన్ని మాడ్గుల విజయ డెయిరీ చైర్మన్ బొజ్జ సాయిరెడ్డి, పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్‌లతో కలిసి గీతనర్సింహ ప్రారంభించారు. యాట నర్సింహ, గుర్రం కేశవులు, శ్రీశైలం, ఖాదర్‌ఖాద్రీ, పర్వతాలు, ప్రభాకర్‌రెడ్డి, జగన్, మానయ్య, రమణారెడ్డి, కృష్ణానాయక్, శ్రీకాంత్, అలీం, ఫరీద్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా సీత్లా వేడుకలు


వేడుకలో మహిళలు

మంచాల, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మండల పరిధి ఎల్లమ్మతండాలో మంగళవారం సీత్లా ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ప్రతి యేటా తొలకరి ఆరంభంలో గిరిజనులు సీత్లా పండుగను భక్తి శ్రద్ధలతో నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ ఉత్సవాల్లో భాగంగా మహిళలు మొలకలతో ఊరేగుతూ సంప్రదాయ నృత్యాలు చేశారు. ఉత్సవాలను తిలకించేదుకు సమీప గ్రామాల నుంచి జనం తరలివచ్చారు.

ఇబ్బందులుంటే హెల్ప్‌లైన్‌ను సంప్రదించాలి

తలకొండపల్లి/శంకర్‌పల్లి, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో కోరారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండల పరిషత్ కార్యాలయంలో హెల్ప్‌లైన్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. వర్షాల నేపథ్యంలో ఏమైనా ఇబ్బందులు తలెత్తితే హెల్ప్‌లైన్ సెంటర్ ఫోన్‌నెంబర్లు 7032030507, 9154949793 సంప్రదించాలని ఆయన సూచించారు. అలాగే భారీ వర్షాలు కురుస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని శంకర్‌పల్లి ఎంపీడీవో వెంకయ్యగౌడ్ తెలిపారు. ఎంపీడీవో కార్యాలయంలో ఆయన అధికారులతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. మరో రెండు రోజుల పాటు భారీ వర్షాలు ఉన్నాయని, అవసరం ఉంటే తప్ప బయటకి రావద్దని ఆయన ప్రజలకు సూచించారు.

ఘనంగా ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవం


కేక్‌ను కట్ చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

షాద్‌నగర్ అర్బన్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ ఎస్సీ బాలికల వసతి గృహంలో మంగళవారం ఏఐఎస్ఎఫ్ 90వ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఆకాష్‌నాయక్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి జిల్లా అధ్యక్షుడు పవన్ చౌహాన్ హాజరై కేక్‌ను కట్ చేసి, విద్యార్థులకు తినిపించారు. ఏఐఎస్ఎఫ్ నాయకులు సాయి చవాన్, రాహుల్, అరుణ్, ప్రకాష్, సునీల్, గణేష్, అంకిత, నిఖిత, నందిని తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

కొందుర్గు, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని కొందుర్గు ఇన్‌చార్జి ఎంఈవో గాయత్రిదేవి సూచించారు. మంగళవారం ముట్పూర్ ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. ప్రతీరోజు విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని వంట సిబ్బందికి సూచించారు.

సంక్షిప్తంగా..

ఆదిభట్ల : ఆదిభట్ల మున్సిపల్ పరిధిలోని కొంగరకలాన్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు 8 వార్డుకు చెందిన కాకి రవీందర్ షూస్ పంపిణీ చేశారు. ఎంఈవో హీర్యానాయక్, ప్రధానోపాధ్యాయుడు కృష్ణ, టీచర్లు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం : పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని, అందుకు ప్రతీ ఒక్కరు ఒక మొక్కను నాటి సంరంక్షించాలని ఇబ్రహీంపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.ఎస్.రాధిక పిలుపునిచ్చారు. మంగళవారం కళాశాల జాతీయ సేవా పథకం, మేరా యువ భారత్‌ల ఆధ్వర్యంలో కేంద్ర పథకం అమ్మకొరకు ఒక చెట్టు నాటుదాం కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థి వాలంటీర్లకు వ్యాస రచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు.

యాచారం : గ్రామపంచాయతీ, ఎంపీటీసీ ఎన్నికలు తక్షణమే నిర్వహించి గ్రామాల ప్రగతిపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించాలని బీజేపీ మండలాధ్యక్షుడు విజయ్‌నాయక్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం మల్కీజ్‌గూడలో మహాసంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా బీజేపీ నాయకులతో కలిసి గ్రామస్తులకు కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించారు. మాజీ మండలాధ్యక్షుడు రవీందర్, నాయకులున్నారు.

కేశంపేట : బంజారాహిల్స్ పెద్దమ్మ తల్లి దేవాలయంలో కూల్చిన చోటనే దేవతామూర్తులు విగ్రహాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం హిందూ సంఘాలు చలో పెద్దమ్మ తల్లి దేవాలయం పేరిట కార్యక్రమం నిర్వహించారు. పెద్దమ్మ తల్లి ఆలయంలో నిర్వహించే కుంకుమార్చన, లలిత సహస్రనామార్చన కార్యక్రమాలకు కేశంపేటకు చెందిన బీజేపీ నాయకులు వెళ్తారని గ్రహించిన కేశంపేట సీఐ నరహరి వారిని ముందస్తుగా అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తీసుకవచ్చారు. అనంతరం సొంత పూచీకత్తుపై వదిలేశారు. బీజేపీ జిల్లా ఓబీసీ ఉపాధ్యక్షుడు నర్సింహ యాదవ్, జిల్లా కౌన్సిల్ సభ్యుడు కంచుకోట మహేష్, కర్రెడ్ల నరేందర్ రెడ్డి, తిరుపతి, సురేష్, కోటి, తదితరులున్నారు.

షాద్‌నగర్ రూరల్ : మాజీ వైస్ ఎంపీపీ బసిరెడ్డి నరేందర్‌రెడ్డి ఉదారత చాటుకున్నారు. కంసాన్‌పల్లి పాఠశాలలో నీటి సమస్యతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నట్లు తెలుసుకుని సొంతంగా బోరు మోటార్ అందజేశారు. వీధుల్లో లైట్లు వేయించారు. నర్సింలు, వెంకటయ్య, యాదయ్య ఉన్నారు.

షాద్‌నగర్ అర్బన్ : భారత గ్రంథాలయ వ్యవస్థాపకుడు, ఆధునిక గ్రంథాలయ శాస్త్ర పితామహుడు ఎస్ఆర్ రంగనాథన్‌కు ఘన నివాళులర్పించారు. జాతీయ గ్రంథాలయ దినోత్సవాన్ని పురస్కరించుకుని షాద్‌నగర్ గ్రంథాలయంలో రంగనాథన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు కొప్పుల మదన్‌మోహన్‌రెడ్డి, సభ్యులు నక్కబాల్‌రాజ్, క్యూసెట్ శ్రీనివాస్, అల్వాల్ దర్శన్‌గౌడ్, వీరేశం, కె. రవినాయక్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

షాబాద్ : ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందని ఎంఈవో లక్ష్మణ్‌నాయక్ అన్నారు. అప్పారెడ్డిగూడ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు జాతీయ మానవహక్కులు, నేర నియంత్రణ సంస్థ జిల్లా అధ్యక్షుడు అనిల్‌కుమార్ స్కూల్ బ్యాగులు, వాటర్ బాటిళ్లు, పలకలను అందజేశాడు. ప్రధానోపాధ్యాయుడు రాజునాయక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శంకర్‌పల్లి : బీజేపీ మండల ఉపాధ్యక్షుడిగా మోకిలకు చెందిన యాదయ్య ఎన్నికయ్యారు. జిల్లా అధ్యక్షుడు రాజ్‌భూపాల్ ఆదేశాల మేరకు మండల బీజేపీ అధ్యక్షురాలు లీలావతి బయానంద్ మాజీ ఎంపీటీసీ యాదయ్యను మండల ఉపాధ్యక్షుడిగా ప్రకటించారు.

ఆమనగల్లు : మంగళపల్లి గేటు సమీపంలోని చెన్నకేశవ స్వామికాలనీ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు హైదరాబాద్‌కు చెందిన అసెన్సెన్ కంపెనీ సహకారంతో మానవత ఫౌండేషన్ ఆధ్వర్యంలో బ్యాగులు, నోట్‌బుక్‌లు, పెన్నుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఫౌండేషన్ సమకూర్చిన వాటిని విద్యార్థులకు ఫౌండేషన్ ఫౌండర్ డాక్టర్ రమ్యసౌజన్య అందజేశారు.

తలకొండపల్లి : స్వయం సహాయక సంఘాల మహిళలు సంఘటితంగా ముందుకు సాగి తమ శక్తిని చాటాలని ఏపీఎం రామస్వామి, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు లావణ్యలు పిలుపునిచ్చారు. మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో మంగళవారం మహిళా సంఘాల సభ్యులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. సామాజిక చేకూర్పు, నూతన స్వయం సహాయక సంఘాల ఏర్పాటు అవగాహన కల్పించారు.

కడ్తాల్ : సన్మార్గంతోనే దైవానుగ్రహం లభిస్తుందని పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. కానుగుబావి తండాలో శ్రీనివాస్‌గౌడ్ పర్యటించారు. డీసీసీ ప్రధాన కార్యదర్శి బీక్యనాయక్‌తో కలిసి తండాలో నూతనంగా నిర్మిస్తున్న తుల్జాభవాని ఆలయాన్ని పరిశీలించారు. ఆలయ నిర్మాణానికి శ్రీనివాస్‌గౌడ్ రూ.50వేలు విరాళాన్ని ఆలయ నిర్వాహకులకు అందజేశారు.

కేశంపేట : సంగెం ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో మౌలిక సదుపాయాలు కలిస్తానని ప్రముఖ కాంట్రాక్టర్ సంగెం(యెన్నం) గోపాల్‌రెడ్డి తెలిపారు. గ్రామస్తులతో కలిసి పాఠశాలను పరిశీలించారు. మరుగుదొడ్ల మరమ్మతులు, నీటి సౌకర్యం కల్పించాలని రూ.25వేల నగదును అందించారు. బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు ఎన్. మురళీధర్‌రెడ్డి, గ్రామస్తులున్నారు.

ఆమనగల్లు : రాష్ట్ర ప్రభుత్వం నుంచి కొండా లక్ష్మణ్ బాపూజీ అవార్డు అందుకున్న మాడ్గుల మండలం కొల్కులపల్లికి చెందిన చేనేత కళాకారుడు గుర్రం చంద్రమౌళిని కల్వకుర్తి ఎమ్మెల్యే నారాయణరెడ్డి అభినందించారు. చేనేత, జౌళిశాఖ అందించే కొండా లక్ష్మణ్ బాపూజీ అవార్డును జాతీయ చేనేత దినోత్సవ వేడుకల్లో చంద్రమౌళి మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ద్వారా అందుకున్నారు. ఆమనగల్లు పట్టణంలోని కళ్యాణి గార్డెన్‌లో ఏఎంసీ మాజీ చైర్మన్ కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో చంద్రమౌళికి అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు.

సీపీఐ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలి


మొయినాబాద్ : పోస్టర్ ఆవిష్కరిస్తున్న రామస్వామి

మొయినాబాద్/మంచాల, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): ఈనెల 19 నుంచి 22 తేదీ వరకు మేడ్చల్ జిల్లా గాజులరామారంలో జరిగే సీపీఐ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రామస్వామి అన్నారు. మహాసభలకు సంబంధించిన గోడ పత్రికలను మంగళవారం మొయినాబాద్‌లో ఆయన ఆవిష్కరించారు. నిరుపేదల పక్షాన పోరాడే పార్టీ సీపీఐ అని ఆయన అన్నారు. జిల్లా కార్యవర్గ సభ్యుడు ప్రభు, సత్యనారాయణ, సుధాకర్‌గౌడ్, మంజుల, మండల కార్యదర్శి కె.శ్రీనివాస్. వెంకటయ్య. బాలమణి రాములు, నర్సింలు తదితరులు పాల్గొన్నారు. మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ మంచాల మండల కార్యదర్శి బండికంటి బాలయ్య శ్రేణులకు పిలుపునిచ్చాడు. ఈమేరు వాల్‌పోస్టర్‌ను మంగళవారం జాపాలలో ఆవిష్కరించారు. జిల్లా నాయకులు నీలమ్మ, నర్ల శ్రీశైలం, అంబోత్‌రాజునాయక్, బొల్గం బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో యూరియా!

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

యాచారం, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): మండలంలో యూరియాకు డిమాండ్ ఉండడంతో పాటు వర్షాలు కురియడంతో రైతులు యూరియా కొనుగోలు చేస్తున్నారు. యూరియా డిమాండ్‌పై ఈ నెల 10న 'ఆంధ్రజ్యోతి'లో జోరుగా యూరియా కొనుగోళ్లు అనే శీర్షికన వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. మంగళవారం యాచారం సొసైటీలో 450 బస్తాల యూరియా తెప్పించగా రైతులు మొత్తం కొనుగోలు చేశారు. అయితే, మరో 950 బస్తాలకు ఇండెంట్ పెడుతున్నట్లు సీఈవో నాగరాజు తెలిపారు.